# నేతి నేతి

●

తాతగారు రావడం చూసి, ఆతడు లేచి నిలుచుని నమస్కారంచేశాడు. ఆశీర్వదించి, పక్కకుర్చీలో కూర్చుని 'అగ్గిపెట్టె అందుకోరా ఓమారు -' అంటే, తీసుకురావ డానికని నేను లోపలికివెళ్ళి...పెట్టినచోట కనబడకపోతే, వెదుకుతున్నాను...పట్టుకునివచ్చేలోపల తాతగారు ఆత డితో పరిచయంచేసుకుని సంభాషణలోకి దిగారు.

'...చాలా సంతోషం బాబూ...నిన్ను చూడ టానికి ముచ్చటగాఉంది. యింత చిన్నతనంలోనే ఫలానా విశ్వవిద్యాలయంలో ఆంధ్రశాఖకు ప్రధాన ఆచార్యుడవైనా వంటే...'

నేనుకూడా ఉత్సాహంకొద్దీ ఆ ప్రశంసా—ప్రవా హానికి అడ్డంఈది...'అవునండీ...అవునండీ—మా కంద రికీ గర్వం యీతన్ని చూసుకుంటూంటే: ఫాయీ ఒక్కటే కాదు, ఆంధ్ర సారస్వతంమీద—అథారిటీ' అన్నాను. అతడు ముసిముసిగా..'ఏమిటోలెండి తమవంటి పెద్దలచలువ! నామీద అభిమానంకొద్దీ మనవాడు అనడంకాని... మీలాటి యోధులముందు మేము లెక్కా జమా' అని వినయించాడు.

'మా చదువూ మేమే చెప్పాలి! చదువుకన్న సందే హాలే ఎక్కువ. ఈనాటికీ తీరవు- పెద్దవాడిని...చనవుతీసు

కుని అడుగుతున్నాను... మరి ప్రయాగ బాపన్న చదువు కున్నవాడూ, కర్మిష్ఠీ అని ప్రతీతి ఉన్నదికదా; అక్కడే పడిఉండి, ఆ మాలకూడు తింటూండకపోతే... దేశం గొడ్డు పోయిందా?—మొఖాసా విడిచిపెట్టి పోతే, యింకోచోట ఆశ్రయం దొరికేదికాదా?—శాంతి సుబ్బన్నంటావూ... వైదికపుముండావాడని అనుకోవడమేకాని—కాస్తో కూస్తో డొక్కశుద్ధిఅయినా...పక్కతాళం బ్రతుకు! భీమరాజు ఏలా అంటే ఆలా ఆడేవాడు. అగ్నీ వాయువూలాగా ఆ యిద్దరూ ఏకంఅయేటప్పటికి—అంతా ఓ కొలిక్కి తీసుకు వచ్చారు అంతేకాదూ?—'

తాతగారు...అంత ఘరానా పెద్దమనిషి...మరొకడిని పరుషవాక్యం అనడం... నేను యించుమించు ఎన్నడూ వినలేదనే చెప్పవచ్చు: ఆయనవాకబులో అనంతకోటిస్కాండల్సు తాండవిస్తున్నా...అంగటిదాటవు. మరి, ఏమిటి ఆ ధోరణి...ఎవరు వాళ్లు—

—నాలాగానే ఆతడూ తెల్లబోయి చూస్తూ ఊరుకున్నాడు.

"తెలియక అడుగుతున్నాను...నీవు అలా ఊరుకోవడం భావ్యంకాదు," అని తాతగారు వదలకుండా హెచ్చరించారు.

"నాకు తెలియదండీ అసలు వా రెవరో" అని ఆతడు చిన్నబుచ్చుకుంటూ కష్టంగా చెప్పాడు.

"తెలియదనడం నీ వినయాన్ని తెలియజేస్తుంది అంతే; అది నిజమవుతుందా?"

"ప్రమాణపూర్తిగా...

"వద్దు బాబూ! అంతమాట అనకూడదు. అబద్ధమాడనలసినంత అవసరం నీకు ఏమివచ్చింది? చూడు, వయసులో నీకన్న పెద్దవాడినా...ఏదో ఉత్సాహంకొద్దీ ప్రసంగంలోకి దించింది, నిన్ను కించపరచవలెనని ఎంతమాత్రమున్నూ కాదు సుమా. నాయన...మంచిది: మీాయిద్దరూ ఖులాసాగా మాట్లాడుకోండి..." అంటూ తాతగారు చుట్ట కిటికీలోంచి బయటకు గిరవాటు వేసి, ఖాండ్రిస్తూ లోపలికి వెళ్ళిపోయినాడు – మంచినీళ్ళు పుక్కిలించడానికి—

—రంగం చెడింది; ఇక నేను కూర్చొన్నా లాభం లేదు కనుక...ఆతడు వెళుతానని లేవగానే నేనూ సరేనని గుమ్మందాకా వెళ్ళి...సాయంకాలము పార్కుకు పెందరాడే వస్తాను, అక్కడనుంచి పిక్చరుకు వెళుదాము... అంటూ ఉత్సాహంగా మాట్లాడి...దిగాలుపడి, జవాబు చెప్పకుండా, మరియాదకు తలఊపి ఆతడు వెళ్ళిపోతూంటే– చూస్తూంటే నాకు చాలా కష్టంవేసి...అక్కడే అలాగే నిలుచునిపోయినాను...

"ఏడి తస్సాగొయ్యా...ద్రావిడుడంటే ఏలాగైనా ఉద్దండుడే..."

తాతగారు – మళ్లా ఏమిటి ఆ ధోరణి? నా వెనకాలనే నిలుచున్నాడని తెలిసికూడా నేను ఆయనకేసి తిరగలేదు. తిరిగితే...తిక్కసీాద...ఏం తూలనాడుతానో అని అమిత భయంవేసింది...ఆయనమీాద అందాకా నాకు అంత గౌరవం.

కాని, ఆయ నేం ఊరుకున్నారా? - "వెంకటశాస్తుర్లు కుటుంబంకూడా అంతదాకా నూజవీడులోనే ఉండేదికాదూ? పిల్ల లెంతమంది? - అల్లుడు పట్టి బడుద్ధాయి, సత్రాలల్లో రాళ్లుకొట్టేరకం...అంతేకాదూ?..."

నాకు...యిహా మండిపోయింది.

"ఏమిటండీ?" అని కొంచెం దురుసుగానే అడిగాను. యిద్దరం ముఖాముఖి కాక తప్పిందికాదు - ఆ ధూకుడుకు.

"అదేనండీ...నేను యిందాకటినుంచీ అంటూన్న దేనండీ...నిజమేనా అండీ..." ఆయన కనుబొమలు చిట్లించి మాట్లాడుతున్నా - కొంటెతనమే కాని...కోపం కాదని తెలుసును; నేను ఏంచేసినా కోప్పడడు...చిన్నప్పుడు నాకు యిచ్చిన వరాలలో అది ఒకటి - అందుకని ఆ ఘట్టంలో నేను నవ్వక తప్పదు...

ఏదీ ఒక సిగరెట్...నలభై యేళ్ళనుంచీ ఏకబిగిని చుట్టకాలుస్తూన్న, వ్రతశీలి...తాతగారు సిగరెట్ కాలుస్తాననడం...ఏమో అంతా విచిత్రంగాఉంది - అదివరకల్లా అయితే, ఆయన మొదలుపెట్టిన అల్లరికి ఆపాటికి అప్పుడే నాకు అంతుచిక్కేది...కలిసి తరువాత కాండ నడిపే వాళ్ళం...కాని...

— తెలివితక్కువగా అంతలో బయటపడటం ఎందుకని...యిచ్చాను. యిద్దరం ముట్టించాము - రెండుదమ్ముల లోనే ఆయన చిగురుకులాగి... రాల్చేశారు ... మనది యింకా కాలుతూనేఉంది—

"ఇలా ఉండాలి" అన్నారు—

"ఏది?"

"ఏదైనా కానీ...పైకి మాంచిఘసందుగా - నాజూకుగా - ముట్టుకుంటే రాలిపోతూ - పట్టుబడితే కాలిపోతూ- ఆఖరైతేనేగాని ఆరకపోవడం. అది నిజంగా సుగుణం కాదూ? -"

ఆవిడపుణ్యమాఅంటూ అమ్మమ్మ యింతలో లోపల నుంచి, మడికట్టుకోమని పిలవడానికని వచ్చి...వింటూ నిలుచుని...నవ్వుతూ—

"బాగానేఉంది, ఆనాటికానాడు మరీ పసిపాపలవుతున్నారా ఏం..."అన్నది - ఆయన నిదానంగా ఆమెను ఎగాదిగా చూసి - "వారకన్యక యీరీతి వలచునటవే" అంటూ తాకేటంత దగ్గరగా వెళ్ళేటప్పటికి ఆమె కంగారుగా ఒక్కఅంగలో లోపలికి పోయింది—

"అదేమిటండీ ... మడిగట్టుకున్నది ... అందులో యివాళ శనివారంకూడానూ"

"అదేనోయ్ పండిత్ జీ నేను అన్నది - ఆమె శనివారకన్యక...యీ సరసములాడేటందుకు సమయాసమయములపాటింపు మనకు అంతగా లేకపోయినా...యీ చేష్టలకు మురిసి, నేను పసివాడిలాగా చెయిచేసుకుంటే నీకే యిబ్బందిసుమా అని హెచ్చరించడమే. యిన్నాళ్ళనుంచీ కాపురంచేస్తున్న అవ్వనుపట్టుకు యిప్పుడు వసంతాలాడించటంకాదు; కన్యక అని గౌరవించడం - దుర్గిలాగా...దుర్గి అంటే పురుషోత్తం మేనకోడ లనుకునేవు... అసలు దుర్గి... ఆ హంశ ఆవహింపజేయడం...సమ్ఝా?"

"బహుత్"

"శహబాస్ ... ఆంధ్రసారస్వత - బోధనస్వాముల కన్న...నీవే మెరుగు..."

"ఆతను పాపం చిన్నబుచ్చుకున్నాడండీ" అని అంతలో మూడ్ మార్చుకుని...యింతకుముందు జరిగిన కలాపంఅంతా ఒక్కసారి ఉప్పెనలాగా జ్ఞాపకంరాగా... మాతిముడుచుకోబోయినాను - తాతగారు జంకకుండా -

"చిన్నబుచ్చుకుంటేకాదు ... దేశానికి ఒరిగేదేం లేదు...చిన్న జీతం పుచ్చుకోమను - అదీ మరియాద"

"ఆతను చాలా మరియాదస్తుడండీ"

"నిజంగా?"

"నిజం"

అయితే నిఘంటువు తీయి చూదాము. పోనీ, నీవు చూడు...చదువురాని సరస్వతి అనే అర్థం ఉన్నదేమో... విశ్వవిద్యాలయంవారు అచ్చువేయించినదే అయితే, ఆ నిర్వచనం ఉందనుకుంటాను..."

"మీకు ఆతనిమీద అంత కోపం ఎందుకో నాకు అర్థంకావడంలేదు—"

"ఆతనిమీద కాదు...యీతనిమీద కాదు... అసలు అజ్ఞానమంటే అందరికీ సహజంగా ఉండే మంటే!"

"అలా ఎందుకు అభిప్రాయపడుతున్నారో"

"పడేసింది...మీ మిత్రుడు...ఆ ప్రధానాచార్య మహాశయుడే...నీవు చెప్పావు...నీ మాటమీద నమ్మకం ఉన్నది...నీమాటేమిటి, విద్యాధికారులకే నమ్మకం కుదిరి

నప్పుడు...ఆతడి కూలంకష పాండిత్యాన్ని నేమ శంకించడం కుదిరియూదా? – లేదు, శంకించనేలేదు; కాని...అంతస్థాయికి నేను అందుకోగలసత్తా లేదు చూడు...అందుకని...లఘువు గానే ధోరణి ప్రారంభించానా...మరి, బెల్లంకొట్టినరాయి లాగా ఊరుకోవడం... తెలియదనడం ... నేను ఏమను కోవాలి?—"

"నాకు అర్థంకాలేదు..."

"అవసరంలేదు...అభిరుచి ఉన్నదేకాని, అంత పండి తుడవనే అహంఉందా నీకు? పైగా సైన్సువాడివి; సైన్సుకూ సారస్వతానికీ సగానికిమించిన ఎరిక ఉండనక్కరలేదు— ఉన్నా దోషం లేదనుకో కాని...ఓపిక ఉండాలి అందుకు. మీ నెచ్చెలికి...ఓపిక...జ్ఞాపకం...అవిరెండూకూడా ఒంటికి పడవనుకుంటాను—"

"మీకు - మా ఉభయులతరుపునా ఒక్క పెద్ద నమ స్కారం; యింతటితో విడిచిపెట్టండి—"

"విడిచిపెట్టడం అంటే యిదివరకల్లా పట్టుకుకూర్చు న్నాను గనుకనా...విషయం వచ్చింది కనుక...విడవదల చుకోలేదు: అమాయకపు బ్రాహ్మణుడు ఆయన...వెనుక టికి...రాజమండ్రిలో హిందీ అంటూ వచ్చి, తెలుగుమీద ఎక్కి తొక్కుతూన్నదని వాపోయినాడు...కాని, యీలా వాళ్ళు తెలుక్కి పెద్దపీట వేయించుకోనటంవల్ల...భాషకూ పాండిత్యానికీ పాపం బద్దలూ చెక్కలూ అవుతూన్నదని గుమతించినట్లులేదు...ఎందుకులే అనుకోవడం ... మనవల్ల మాత్రం ఏమవుతుంది—"

"అంతేలెండి"

"అని ఊరుకుందాం; సరేకాని, ఒక్క చిన్న అనుమానం...అది మీ మిత్రుడు తీర్చితే...యింతసేపునుంచీ అనుకున్నదిఅంతా మరచిపోతాను. చాలా తేలికవిషయం—తెలియకుండాఉండటానికే వీలులేదు; ఏమంటే - మోడే రాయలకూతురు నిద్రపోతున్నప్పుడు - తెలియకుండా ఎవడో చీకట్లోనే చిందువేసిపోయినాడట...ఏమిటి కారణం? - అంతే - ఏం?"

"యిందాకటివాటి తాతలాగా ఉంది"

"అయితే - కాలేజీమానేసి...మడిగట్టుకు యింట్లో కూర్చుని, శుద్ధనిర్గుణ కందార్థదరువులు - సాగించమను— ఉచ్ఛనీచాలుఉన్న సారస్వతులకు అదే శిక్ష"—

— భోజనంవేళఅయింది.

—::—